
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
సోమవారం 20 జనవరి 2025
జిల్లాల వార్తలు





తిరుగు ప్రయాణం

సంగారెడ్డి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరుగు ప్రయాణమయ్యారు. సంగారెడ్డిలోని బస్టాండ్లు ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. డిపో మేనేజర్ ఉపేందర్ కొత్తబస్టాండ్‌ను సందర్శించి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. సంక్రాంతికి రీజియన్ వ్యాప్తంగా 20వ తేదీ వరకు ఎనిమిది డిపోల నుంచి 280 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.







సంగారెడ్డి పట్టణంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన నిర్మలాజగ్గారెడ్డి

87 మందికి రూ.50 లక్షల చెక్కుల పంపిణీ

సంగారెడ్డి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఆపన్నహస్తంగా నిలుస్తున్నదని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బాధితులకు ఆదివారం ఆమె సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నిర్మాలాజగ్గారెడ్డి చేతులమీదుగా నియోజకవర్గంలోని 87 మంది లబ్దిదారులకు సుమారు రూ.50లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మండల అధ్యక్షుడు సిద్ధన్న, మండల నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మునిపల్లి సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శరణు.. శరణు..

బోనమెత్తిన కొమురవెల్లి... పట్నంవారం భక్తజనసంద్రం

- బోనాలు, పట్నాలతో దండిగా మొక్కులు
- డప్పుల దరువు నడుమ శివసత్తుల సిగాలు, పోతరాజుల విన్యాసాలు..
- మల్లన్న నామస్మరణతో పులకించిన భక్తులు



ఆలయ రాజగోపుర ప్రాంగణంలో భక్తజనసందోహం

చేర్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోరమీసాల మల్లికార్జున స్వామికి కొమురవెల్లి బోనమెత్తింది. శివసత్తుల పూనకాలు, డిల్లెం, కల్లెం చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, ఒగ్గుల పూజలు, జగ్గుల మోతలు, డప్పుచప్పుళ్ల దరువులతో మల్లన్న ఆలయ పరిసరాలు హోరెత్తాయి. జయహో కొమురవెల్లి మల్లన్న..శరణు.. శరణు.. అన్న జయజయధ్వానాలు మార్మోగాయి. కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వేలాది మంది భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న నామస్మరణతో విజయా ఛలగుట్టలు మార్మోగాయి. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం తెల్లవారుజామున మల్లన్న ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానమాచరించారు. మొక్కుబడులుగా తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారుచేసి నైవేద్యాన్ని నివేదించారు. బసచేసిన, ఆలయ గంగిరేగు చెట్టు ప్రాం తంలో, ముఖమండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖ మండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నా రు. స్వామివారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యాలు పోశారు. తమ కోర్కెలు నెరవేర్చమని ముడుపులు కట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరంపట్టారు.



వీరంగం చేస్తున్న పోతరాజులు



ఎల్లమ్మకు బోనాలు

మల్లన్న దర్శనానంతరం స్వామివారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతూ ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కి అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో ఎల్లమ్మ గుట్ట ప్రధానద్వారం నుంచి ఆలయం వరకు భక్తులు బారులు తీరారు.

క్యూలైన్లలో పడిగాపులు

వేలాదిమంది భక్తులు హాజరైన నేపథ్యంలో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. స్వామివారి దర్శనానికి సుమారు 3గంటల సమయం పట్టడంతో ఇబ్బందులకు గురయ్యారు. ఉచిత, శీఘ్ర, వీఐపీ దర్శన క్యూలైన్లలో భక్తులు

మిగతా 7వ పేజీలో...



బస్వాపూర్ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

రూ. 100 కోట్లతో టూరిజం స్పాట్‌గా సింగూరు

- ఎనిమిది నెలల్లో విద్య, వైద్య రంగాల్లో అందోలు అభివృద్ధి
- సింగూరు కాల్వలకు సీసీ లైనింగ్ పనులు త్వరలో ప్రారంభం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట/పుల్కల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టును రూ. 100 కోట్లతో రాష్ట్రస్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆయన ఆదివారం జోగిపేట, సింగూరు గురుకుల పాఠశాలలు, బస్వాపూర్ ఆదర్శ పాఠశాల, పుల్‌కల్ కస్తూర్బా బాలిక పాఠశాలలో నిర్మాణ పనులను, ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం, సింగూరు కాల్వలకు కాంక్రీట్ లైనింగ్ పనుల ప్రారంభోత్సవం కోసం నిర్దేశించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం పాఠశాలల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించినా, ఆలస్యం జరిగినా సహించేది లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. రాబోయే 8 నెలల్లో అందోలు నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. గతంలో సింగూరు ప్రాజెక్టును పలు విధాలుగా అభివృద్ధి చేశానని, ప్రస్తుతం రూ. 100 కోట్లతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే పనులను చేపడతామని చెప్పారు. సింగూరు కాల్వలకు చేపట్టనున్న కాంక్రీట్ లైనింగ్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలియజేశారు. మంత్రి వెంట రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీవో పాండు, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, దుర్గారెడ్డి, హన్మాండ్లు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.



ఘనపురం ప్రాజెక్టుకు జలకళ

పాపన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు (ఘనపురం ఆనకట్ట) జలకళను సంతరించుకుంది. యాసంగి సాగు కోసం ఈ నెల 15న సింగూరు ప్రాజెక్టు నుంచి 350 ఎంసీఎఫ్‌టీల నీటిని దిగువకు విడుదల చేయగా ఆదివారం ప్రాజెక్టుకు చేరింది. మహబూబ్ నహర్, ఫతేనహర్ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

లక్ష్యం 3.90 లక్షల మెట్రిక్ టన్నులు

కొనుగోలు కేంద్రాల్లో సేకరించింది 2,91,263



(ఫైల్)

- మెదక్ జిల్లాలో ముగిసిన ధాన్యం సేకరణ
- సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ
- అంచనాలు అందుకోని కొనుగోళ్లు

మెదక్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసింది. సన్నరకం, దొడ్డురకాలకు వేర్వేరుగా కొనుగోలు చేశారు. మెదక్ జిల్లాలో 3.90 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 4 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ వేసింది. ఈ ధాన్యాన్ని సేకరించడానికి 496 కొనుగోలు కేంద్రాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. కానీ, అంచనాల కంటే తక్కువగా 2,91,263 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సివిల్‌సప్లై అధికారులు సేకరించారు. పంట కోతలు పూర్తయ్యాక వానలు కురియడంతో తడిసిన ధాన్యాన్ని బ్రోకర్లు, మిల్లర్లకు విక్రయించారు. గతంతో పోల్చితే డబ్బుల చెల్లింపులు వేగంగా జరిగాయి. ధాన్యం కాంటా పూర్తవగానే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిల్లులకు తరలించిన రెండు, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. రూ. 675.73 కోట్లు రైతులకు చెల్లించారు. రాష్ట్ర సర్కార్ వానాకాలం సీజన్‌లో సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో, జిల్లావ్యాప్తంగా లక్ష ఎకరాల విస్తీర్ణంలో సన్నరకాలు సాగు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో 53,659 మెట్రిక్ టన్నుల సన్న వడ్లను విక్రయించారు. ఇందుకు సంబంధించి రూ. 124.49 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతులకు రూ.20 కోట్లు బోనస్ చెల్లించినట్లు పౌరసరఫరాల శాఖ డీఎం హరికృష్ణ తెలిపారు. మిగతా రూ.6 కోట్ల బోనస్ త్వరలోనే చెల్లిస్తామని వివరించారు.

కొనుగోలు కేంద్రాలు	496
ధాన్యం సేకరణ అంచనా	4లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసిన ధాన్యం	2,91,263 మెట్రిక్ టన్నులు
ధాన్యం విలువ	రూ. 675.73 కోట్లు
వడ్లు విక్రయించిన రైతులు	70,977

చాముండేశ్వరీ మాతా నమోనమః



ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవం 7

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సిలిండర్ పేలి దివ్యాంగురాలి మృతి

గ్యాస్ లీకేజీని గమనించక దీపం వెలిగిస్తుండగా పేలుడు 7

రామాయంపేటకు బైపాస్ గుబులు

32 ఎకరాల భూములు, పలు భవనాలకు ఎసరు 7

అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

- ఈ నెల 21 నుంచి గ్రామసభల నిర్వహణ
- నిరంతరం దరఖాస్తు చేసుకోవచ్చు
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లు



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక, గ్రామసభల నిర్వహణపై ఆదివారం ఆమె ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 26 నుంచి పథకాలను అమలు చేయడాని లబ్ధిదారుల ఎంపికచేయాలని నిర్దేశించారు. ఇందుకోసం ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చివరి లబ్ధిదారుని వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత జాబితా తుది జాబితా కాదని, రేషన్‌కార్డులు రాని వారి నుంచి గ్రామసభల్లో దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాపాలన సేవాకేంద్రాల ద్వారా కొత్త రేషన్‌కార్డులకు, కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అన్నారు. వ్యవసాయయోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతుభరోసా ఇస్తామని తెలిపారు. సమస్మాత్మక ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

మెదక్ అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త కార్డులను ప్రభుత్వం అందజేస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పాతూర్‌లో కొత్త రేషన్‌కార్డుల వెరిఫికేషన్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డుల కోసం గ్రామ సభలో దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సభల్లో ప్రజాభిప్రాయాలు, ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతోపాటు గ్రామ సభలు, ప్రజాపాలన సేవ కేంద్రాల్లో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఇప్పటికే ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మాత్రమే తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రేపటి నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గజ్వేల్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లెపు సుధాకర్(29), భార్య భానుప్రియ, కొడుకు, కూతురు ఉన్నారు. ఈనెల 16న తన పొలం వద్ద సుదాకర్ పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

క్రైం కార్నర్

బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు
ఒకరి మృతి

● రోడ్డు పక్కన ఉన్న మరొకరికి తీవ్రగాయాలు


సురేష్ (ఫైల్)

చేగుంట, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన నార్సింగి శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలం బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన చిమ్మనమైన సురేష్ (30) నార్సింగి సమీపంలోని వడ్డెర కాలనీ వద్ద హైవేపై రోడ్డు పక్కన బైక్‌ను నిలిపి ఉన్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డు పక్కనే ఉన్న జప్తిశివనూర్‌కు చెందిన మైలారం ప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సురేష్‌కు భార్య జయ సంవత్సరంలోపు బాబు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీసా రాలేదన్న మనస్తాపంతో
యువకుడి ఆత్మహత్య

రామచంద్రాపురం టౌన్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ పూర్తిచేసిన యువకుడు విదేశాలకు వెళ్దామనుకున్న ఆశ సుదూర స్వప్నంగా మారడంతో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ జగన్నాథం తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మున్సిపల్ పరిధి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో నివాసం ఉంటున్న ప్రశాంత్ (27) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నారు. యూకేలో పోస్టుగ్రాడ్యుయేషన్ కోసం వీసాకు దరఖాస్తు చేశారు. ప్రాసెసింగ్‌లో ఉండగా, లండన్ వెళ్లాలనుకున్న ఆశలు మృగ్యంగా మారుతున్నాయని మథనపడ్డాడు. మరోవైపు ఇంట్లో ఆర్థిక సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రశాంత్ ఆదివారం మధ్యాహ్నం సమయంలో మోటారుసైకిల్‌పై రామచంద్రాపురం ఇక్రిశాట్ వద్దకు వచ్చాడు. ఇక్రిశాట్ వెనుకవైపునకు వెళ్లి, రైల్వే పట్టాల పక్కనే ఆగి అన్న సాయిచంద్‌కు ఫోన్‌లో మెసేజ్ పెట్టారు. 'నన్ను క్షమించు ఇందులో తప్పు ఎవరిదీ కాదు పరిస్థితులు అర్థం కాకపోవడం వల్లే మానసికంగా ఒత్తిడికి గురయ్యాను'.. అంటూ సందేశం పంపించాడు. అన్న ఫోన్‌కు లోకేషన్‌ను షేర్ చేసి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోకేషన్ ఆధారంగా అన్న సాయిచంద్ అక్కడికి చేరుకోగా అప్పటికే ప్రశాంత్ చనిపోయాడు. సాయిచంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటర్ విద్యార్థిని..

పాపన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్‌పల్లిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. పొడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన అరిగే కృష్ణ కుమార్తె సింధూజ(19) మెదక్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. నెల రోజులుగా కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో దిగులుగా ఉంటుంది. కుటుంబీకులు కళాశాలకు కచ్చితంగా వెళ్లమని చెప్పగా ఆవేశానికి గురైన సింధూజ శనివారం మధ్యాహ్నం ఇంట్లో కుటుంబీకులు ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబీకులు గమనించి స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందింది. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడ్డెపల్లిలో యువతి..

రాయపోల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ యువతి మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లికి చెందిన అంజలి(20) రోజూ మాదిరిగానే ఆదివారం కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం అన్నం తినడానికి ఇంటికి వచ్చింది. ఎంతసేపైనా తిరిగి కూలి పనికి రాకపోవడంతో యజమాని ఈ విషయాన్ని ఆమె తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు ఇంట్లో చూడగా అంజలి ఉరేసుకొని కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఆమె ఆత్మహత్య కారణాలు తెలియాల్సి ఉన్నది.

బావిలో కుళ్లిన శవం లభ్యం

మనోహరాబాద్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా బావిలో కుళ్లిన శవం లభ్యమైన ఘటన మండల పరిధిలో ఆదివారం సాయత్రం చోటుచేసున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో.. కొండాపూర్ పరిశ్రమలకు వెళ్లే దారిలో పాడుబండ బావిలో గుర్తుతెలియని మృతదేహం కనిపించింది. చుట్టుపక్కల వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చాలా రోజుల క్రితం బావిలో పడి ఉండటంతో మృతదేహం కుళ్లిపోయింది. పోలీసులు హత్య.. ఆత్మహత్యా.. అన్న కోణంలో విచారణ చేపట్టారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.









శరణు..శరణు

5వ పేజీ తరువాయి

రాక రాత్రి వరకు కొనసాగింది. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ ఎల్ శ్రీను ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్లన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం జరిపి మొక్కు తీర్చుకున్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో నీటివసతి

భక్తులకు తాగునీటి వసతి కల్పించని విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం చేసిన కథనానికి కలెక్టర్ మను చౌదరి స్పందించి ఆలయాధికారులతో పాటు మిషన్ భగీరథ అధికారులకు తగు సూచనలు చేశారు. దీంతో ఆలయాధికారులు క్యూలైన్లలో వాటర్ బాటిళ్లు అందించడంతో పాటు పరిసరాల్లో నల్లాల ద్వారా నీటిని అందించడంతో భక్తులు ఊరట చెందారు.

మల్లన్న భక్తుల పరేషాన్

పట్నంవారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలిరాగా, ఆయాశాఖల అధికారులు, ఆలయవర్గాల సమన్వయలోపంతో ఇబ్బందులుపడ్డారు. పారిశుధ్య చర్యలు చేపట్టడంలో విఫలమవడంతో ఆలయ పరిసరాలు చెత్తమయంగా మారాయి. డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయకపోవడంతో అన్నప్రసాదం ప్లేట్లు ఎక్కడపడితే అక్కడే కనిపించాయి. కోనేరు నీటిని శుద్ధి చేయకపోవడంతో నీళ్ల రంగుమారి కలుషితమైంది. పలు ప్రదేశాలలో డ్రైనేజీనీరు రోడ్డుమీద నుంచి ప్రవహించింది. అలాగే ఎవరిని పడితే వారిని వీవీఐపీ క్యూలైన్‌గుండా పంపిస్తుండటంతో గంగిరేగుచెట్టు ప్రాంగణంలోని వీవీఐపీ క్యూలైన్ వద్ద బారీగా భక్తులు బారులు తీరారు. టికెట్ తీసుకుంటేనే అనుమతిస్తామని సూచించినప్పటికీ పలువురు వాగ్వాదానికి దిగారు. తలనీలాల సమర్పణలో క్షురకులు కట్నాలపేరిట ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేశారు. కొబ్బరికాయ ధరను కొండెక్కించారు. ఒక్కటి రూ.50 చొప్పున విక్రయించారు. ఎల్లమ్మతల్లి ఆలయ ఆవరణలో భక్తులు సాక పెట్టిన కల్లు, బెల్లంపానకం, కొబ్బరికాయ నీరు మెట్లగుండా ప్రవహించడంతో భక్తులు నడవటానికి ఇబ్బందులుపడ్డారు. కల్లుసీసాలను అధిక ధరలకు విక్రయించారు. గుట్టపైన వాటర్‌ప్యాకెట్లు, చెత్తచెదారం తొలగించలేదు. పార్కింగ్ ప్రదేశాలలో నీటివసతి కల్పించకపోవడంతో సమీప వ్యవసాయ బావుల వద్ద నుంచి తెచ్చుకుని నానాతంటాలు పడ్డారు. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు పెద్దపట్నం

ఆలయ తోటబావి ప్రాంగణంలో నేడు హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటనున్నారు. ఒంటి నిండా పసుపు ధరించి భక్తులు పట్నంతొక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.


దర్శన క్యూలైన్‌లో భక్తులు


కోనేరులో మురుగు నీరు


ఎల్లమ్మగుట్టపై చెత్తచెదారం

చాముండేశ్వరీ మాతా నమోనమః

● ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవం
● అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చిలిప్‌చెడ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీర తీరాన వెలసిన శ్రీచాముండేశ్వరి మాత 42వ వార్షికోత్సవాలు కన్నులపండుగగా కొనసాగుతున్నాయి. మొదటి రోజైన ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంజీరా నది నుంచి గంగాజలాన్ని వాయిద్యాలతో శాస్త్రోక్తంగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలోని బ్రాహ్మి, కాళి, వైష్ణవిమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సునితారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించి, ఒడిబియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నహీం, పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు నీరాజనం

ఏడుపాయల వనదుర్గామాత ఆలయ సన్నిధి ఆదివారం భక్తజనసందోహంగా మారింది. వారాంతపు సెలవు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.
- పాపన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి)

రామాయంపేటకు మరో బైపాస్ గుబులు

● 32 ఎకరాల భూములు, పలు భవనాలకు ఎసరు
● మార్కింగ్ ఇచ్చిన హైవే అథారిటీ
● అయోమయంలో స్థానికులు

రామాయంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మరో బైపాస్ ఏర్పాటుతో స్థానికులకు గుబులు పట్టుకున్నది. పనులు వేగవంతమై.. రామాయంపేట దాకా చేరుకున్నాయి. అంతేకాదు తాజాగా ఆదివారం హైవే అథారిటీ జంక్షన్ల వద్ద మార్కింగ్ ఇచ్చింది. దీంతో ఇక తమ భూములు లాక్కోవటం ఖరారేనని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3 కిలోమీటర్ల మేర 32 ఎకరాల్లో వ్యవసాయ భూములు, వెంచర్లలోని ప్లాట్లు, పలు భవనాలు కూల్చివేయనున్నారు. సంగారెడ్డి-ఎల్కతుర్తి వరకు కొత్త హైవే నిర్మాణంలో భాగంగా రామాయంపేటలో బైపాస్ అనివార్యమైంది. ఇదే మండలం అక్కన్నపేటలోనూ రైల్వే ట్రాక్ అడ్డురావడంతో అక్కడ కూడా బైపాస్ ఏర్పాటవుతుంది. కాగా పట్టణంలో రెండో బైపాస్ కానుండటంతో తమ విలువైన పొలాలు కోల్పోతున్నామంటూ పట్టణంలో బాధితులు ఇటీవల రామాయంపేట బంద్‌ను నిర్వహించి, ఆందోళన సైతం చేపట్టారు. పలుమార్లు అధికారులతో ఘర్షణ పడాల్సి వచ్చింది. చివరకు ఇక్కడి మెదక్ చౌరస్తా మీదుగా వేయాలంటూ వ్యాపారులు, నిర్వాసితులు వేడుకుంటున్నారు.


జంక్షన్ ఏర్పాటయ్యే రామాయంపేట పాత హైవే

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక

● సిద్దిపేట జిల్లాలో ప్రారంభమైన పది ప్రత్యేక తరగతులు
● 49 రోజుల పాటు నిర్వహణ

కొండపాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు పదికి పది జీపీఏ పాయింట్లు సాధించడమే లక్ష్యంగా సిద్దిపేట జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు వివిధ యాజమాన్యాల పాఠశాలలో సుమారు 11 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాస్తున్నారు. మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రణాళికను అమలు చేస్తున్నారు. శనివారం నుంచి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే చాలా పాఠశాలల్లో పదో తరగతి సిలబస్ దాదాపుగా పూర్తయింది. ఈ ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేసి, వారిని అన్ని విషయాల్లో అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు చూస్తారు. మార్చి 19 వరకు ఈ ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకు నిర్ణయించిన సబ్జెక్టుపై ప్రాక్టీస్ పరీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4.15 నుంచి 5.45 నిమిషాల వరకు అభ్యసనంకు కేటాయించారు. సెలవులతో సంబంధం లేకుండా ప్రతీరోజు కొనసాగుతాయి. ప్రతీ ఆది, రెండో శనివారం రోజుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించుటకు కృషి చేస్తారు. ఈవిధంగా విద్యార్థులను సంసిద్ధం చేసి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

అందరూ ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం

- ఎల్లంకి శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట డీఈవో

జిల్లాలోని ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాన్ని సాధించే దిశగా చర్యలు చేపట్టాం. 49వ రోజుల పాటు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలి. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని చదువులో ముందంజలో ఉండేవిధంగా కృషి చేయాలి. విద్యార్థుల స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.


ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో సత్తయ్య

సమ్మర్ డిమాండ్ పరిశీలనకు ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సర్కిళ్ల వారీగా పర్యవేక్షణకు ఇన్‌చార్జీలుగా డైరెక్టర్లు, సీఈలను నియమించింది. వేసవిలో నెలకొనే విద్యుత్‌డిమాండ్‌తో పాటు క్షేత్రస్థాయిలో ఫీడర్లపై అధిక లోడ్ పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర మరమ్మతు పనుల నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నారు. సంగారెడ్డి, మేడ్చల్ సర్కిల్‌కు కె.నందకుమార్ (ప్రాజెక్ట్ డైరెక్టర్), సిద్దిపేట, హబ్సిగూడ సర్కిల్‌కు సాయిబాబా (కమర్షియల్ డైరెక్టర్), మెదక్ సర్కిల్‌కు బాలస్వామి (సీఈ- రూరల్‌జోన్)ను నియమించారు.

మూడుసార్లే ఎంఎంటీఎస్ కూత

రామచంద్రాపురం టౌన్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం నుంచి ఎంఎంటీఎస్ రైలు మూడుసార్లే కూత పెడుతుంది. ఎప్పుడు నడుస్తుందో.. ఏ వేళ వస్తుందో స్థానికులకు కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. పటాన్‌చెరు, రామచంద్రాపురం, ఐడీఏబొల్లారం, కాజిపల్లి, పాశమైలారం, రుద్రారం, సుల్తాన్‌పూర్ పారిశ్రామికవాడల్లో పనిచేస్తూ నగరం చుట్టుపక్కల కార్మికులు, ఉద్యోగస్తులు నివాసాలు ఉంటున్నారు. వారందరికీ ఉపయోగకరంగా ఉండేందుకు పటాన్‌చెరు వరకు ఉన్న రైలు పట్టాలను వినియోగించి లోకల్ రైలు నడపాలంటూ 15 ఏళ్ల క్రితం అప్పటి మెదక్ ఎంపీ విజయశాంతికి స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఆసమయంలో ఎంఎంటీఎస్ రైలును లింగంపల్లి నుంచి రామచంద్రాపురం వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తెల్లాపూర్, బెల్ ఎంఐజీ స్టేషన్‌లతో పాటు రామచంద్రాపురంలో ఇక్రిశాట్ ఆనుకుని చివరి స్టేషన్‌ను నిర్మించారు. పదేళ్ల క్రితం అన్ని రకాల నిర్మాణ పనులు పూర్తిచేశారు. కానీ, దశాబ్దకాలంగా ప్రయాణికులకు మాత్రం పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి రావడం లేదు. ప్రారంభించలేదు అనే మాట రాకుండా ఉండేందుకు అన్నట్టుగా రైల్వేశాఖ అధికారులు రోజువారీగా తూతూమంత్రంగా ఎంఎంటీఎస్ రైలును నడుపుతున్నారు. రామచంద్రాపురం నుంచి ఫలక్‌నామా, ఘట్‌కేసర్ ప్రాంతాలకు రోజుకు మూడుసార్లు రాకపోకలు సాగిస్తోంది. ఉదయం 8.30, సాయంత్రం 4.40, 5.15 గంటలకు రైళ్లు నడుపుతున్నారు. వీటిని రోజువారీగా నిర్వహణ చేయడానికి ముగ్గురు సిబ్బందిని నియమించారు. రైలు నడుపుతున్నారన్న సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కువగా రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అన్ని వేళలా ఎంఎంటీఎస్ రైళ్లను నడిపి, అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని కార్మికులు కోరుతున్నారు.




సిలిండర్ పేలుడు ధాటికి నేలమట్టమైన రేకుల షెడ్డు

సిలిండర్ పేలి దివ్యాంగురాలి మృతి

కల్హేర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : దిక్కుమొక్కు లేని ఓ దివ్యాంగురాలు సిలిండర్ పేలిన ఘటనలో దుర్మరణం పాలైన ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు, కల్హేర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌ధర్ గ్రామానికి చెందిన కంది ప్రేమల(52) దివ్యాంగురాలు. ఆమెకు ఒక కూతురు ఉంది. భర్త చాలా రోజుల క్రితమే వదిలిపెట్టగా గ్రామంలో ఉంటున్న తన సోదరుడు ఇంటికి రానివ్వడం లేదు. దీంతో గ్రామంలోనే భిక్షాటన చేసుకుంటూ ఎక్కడ పడితే అక్కడే నిద్రిస్తుండేది. చలించిన గ్రామ యువకుడు పరువు రవిందర్ స్థానిక ఎస్సీ కాలనీలో ఒక రేకుల షెడ్డు ఏర్పాటు చేయించాడు. రేకుల షెడ్డులో కరెంటు సౌకర్యం లేకపోవడంతో శనివారం సాయంత్రం కాగా, ప్రేమల దీపం వెలిగించగా అప్పటికే సిలండర్ ఆన్‌లో ఉండి లీకేజీ అవటంతో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. నడవడానికి రాని ఆమె మంటల చిక్కుకుని బయటకు రాలేక నిస్సహాయురాలిగా అయిపోయింది. గ్రామస్థులు అక్కడికి చేరుకునే లోపే ప్రేమల పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అనంతరం అంబులెన్స్‌లో మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆదివారం పోస్టుమార్టమ్ నిర్వహించారు. మృతురాలు కూతురు భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుచున్నట్లు కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.


కంది ప్రేమల(ఫైల్)

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ

కోహీర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిగ్వాల్ గ్రామ సమీపంలో గల కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి హుండీని పగులగొట్టి అందులోని బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకున్న పూజారి శివ శంకరయ్య ఈ విషయాన్ని గమనించి కోహీర్ పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న వారు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మరికొన్ని రోజుల్లో నిర్వహించే ఆలయ వార్షికోత్సవం నిమిత్తం భక్తులు ఇచ్చిన నగలను కూడా హుండీలో భద్రపర్చినట్లు ఆలయ పూజారి తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ గోపతి సతీష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామానికి చెందిన కురుమ యాదమ్మ పొలం పనులకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నది. గ్రామ శివారు మెదక్ చేగుంట రహదారిపై వస్తుండగా ఎస్ కొండాపూర్ గిరిజనతండాకు చెందిన రాతుల శ్రీను చిన్నశంకరంపేట నుంచి బైక్ వస్తూ యాదమ్మను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా చికిత్స ఆస్పత్రికి తరలించారు.

మంటలంటుకొని లైన్‌మన్‌కు..

మెదక్ అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిట్లంబేస్ వీధిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు ఆదివారం మరమ్మతులు చేస్తుండగా.. అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో లైన్‌మన్ పరశురాంకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ట్రాన్స్‌కో ఏఈ నవీన్‌కుమార్ తెలిపారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కల్హేర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని శివాజీ చౌక్‌లో ఆదివారం తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాల నడపుతూ పట్టుబడ్డారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు కూడా లేకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చేగుంట, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట గ్రామానికి చెందిన తిరుపతి మౌనిక(28) తల్లిదండ్రులు చనిపోవడంతో ఒంటరిగా జీవితం గడుపుతుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆదివారం రాత్రి వడియారం రైల్వేస్టేషన్‌లో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా రెండు కాళ్లు విరిగి పోయాయి. గమనించిన రైల్వే సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

కూలిన బిల్డింగ్ సజ్జ

మనోహరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి కూచారం గ్రామంలోని యువజన భవనం బిల్డింగ్ ద్వారం పైన ఉన్న సజ్జ కూలింది. రెండేళ్లక్రితం రూ.20 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఇందులో ప్రస్తుతం గ్రంథాలయం నిర్వహిస్తుండగా, నిత్యం 40 మంది వరకు యువకులు వచ్చి చదువుకుంటారు. శనివారం రాత్రి ఎవరూ లేని సమయంలో సజ్జ కూలడంతో పెను ప్రమాదం తప్పింది. పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే భవన సజ్జ కూలిందని సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ యువకులు కోరారు. మున్ముందు భవనం మొత్తం కూలితే పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు.

కంపు.. కంపు



రామచంద్రాపురం : చెత్తచెదారంతో నిండిన ఎల్ఐజీకాలనీ వెనుక రోడ్డు



ఐడీఏబొల్లారం : బతుకమ్మ ఘాట్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

చెత్తశుద్ధి ఏదీ?

రామచంద్రాపురం టౌన్/ ఐడీఏబొల్లారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి భెల్‌కాలనీకి ఆనుకొని ఉన్న ఎల్ఐజీకాలనీ వెనుక రోడ్డులో పచ్చని చెట్లతో అలరారుతోంది. వేసవి వచ్చిందంటే మండుటెండలో సైతం చల్లదనాన్ని ప్రసాదిస్తుంది. అలాంటిది చుట్టుపక్కల కాలనీవాసులు ఇష్టారీతిన చెత్తను ఇక్కడ పారబోస్తున్నారు. గృహాల నుంచి వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్‌లో మూటకట్టి డ్యూటీలకు వెళ్తూ ఇక్కడ చెట్ల మధ్యకు విసిరేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేయాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయి కంపుకొడుతున్నది. దీంతో అటుగా వాహనాలపై రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సి దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని హరిత ప్రేమికులు కోరుతున్నారు. అలాగే ఐడీఏబొల్లారం పట్టణంలో మాధవానికుంటలోని బతుకమ్మఘాట్ మురుగు మయంగా మారింది. పరిశ్రమల వ్యర్థాలను డంప్ చేయడంతోపాటు చుట్టుపక్కల నివాసముండే ప్రజలు చెత్త చెదారాన్ని ఇక్కడ వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. దీంతో ఆహ్లాదం పంచాల్సిన కుంట కంపు కొడుతున్నది.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు షురూ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి ధనుంజయ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మొదటివారం సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి కొండపైకి కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో శశిధర్ గుప్తా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ హరికృష్ణ, మన్సూర్, రమణ గౌడ్, హనుమంత్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.;

జాతీయ రహదారులుగా గుర్తించాలి

● ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గంలోని రెండు రహదారులను రెండు రాష్ట్రాలకు అనుసంధానిస్తూ జాతీయ రహదారులుగా గుర్తించాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవరెడ్డి అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆదివారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ నుంచి సిద్దిపేట, మెదక్‌ల మీదుగా ఉన్న జాతీయ రహదారిని జహీరాబాద్ వరకు పొడిగించాలన్నారు. ఈ మార్గంలోని ఉసిరికేపల్లి నుంచి ఖేడ్, కంగ్టి, ఔరాద్, లాతూర్‌ల మీదుగా ఉద్గీర్‌లోని జాతీయ రహదారి వరకు 170 కి.మీలను జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. అలాగే ఖేడ్ మీదుగా 161బీ జాతీయరహదారి ఉన్నందున ఇక్కడి నుంచి కరస్‌గుత్తి, సంత్‌పూర్, సంగం, కమల్‌నగర్‌లమీదుగా నీలంగా వరకు ఉన్న రహదారిని ఎన్‌హెచ్‌గా గుర్తించి అక్కడి జాతీయ రహదారికి అనుసంధానించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు రాజేష్‌చౌహాన్, నర్సింహులు, రామక్రిష్ణ, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం



మంత్రిని కలిసి ఆహ్వానిస్తున్న టోర్నీ నిర్వాహకులు

జోగిపేట, జనవరి20 (ఆంధ్రజ్యోతి): జోగిపేటలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ముగింపు ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను నిర్వాహకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కౌన్సిలర్ ఆజుల చిట్టిబాబు ఆధ్వర్యంలో రాజనరసింహ స్మారక క్రికెట్ టోర్నీ నిర్వాహకులు అర్షద్, ఖలీల్ తదితరులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 26న జోగిపేట లో టోర్నీ ముగింపు కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.

రేపటి నుంచి గ్రామసభలు

తూప్రాన్/రేగోడు జనవరి 19(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషాద్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు చేపడుతున్నట్లు వివరించారు. 21న వట్టూరు, దాతర్‌పల్లి, వెంకటరత్నాపూర్, 22న కోనాయపల్లి (పీబీ), కిష్టాపూర్, ఇమాంపూర్, నర్సంపల్లి, నాగులపల్లి, వెంకటాయపల్లి, 23న గుండ్రెడ్డిపల్లి, ఇస్లాంపూర్, మల్కాపూర్, యావాపూర్, ఘనపూర్‌లలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేగోడు మండలంలో నేటి నుంచి..

ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల ద్వారా ప్రకటించేందుకు సోమవారం నుంచి రేగోడు మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలానికి కొత్తగా 276 ఆత్మీయ భరోసా మంజూరు కాగా లబ్ధిదారుల నుంచి బ్యాంక్ అకౌంట్, ఆధార్ జీరాక్స్‌లను ఉపాధి హామీ సిబ్బంది సేకరించారు. 422 రేషన్ కార్డులు మంజూరు కావడంతో గ్రామసభల ద్వారా గుర్తించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక కసరత్తు కొనసాగుతుంది. ఈ నాలుగు పథకాలపై గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

క్రీడాహబ్‌గా మైత్రీ మినీ స్టేడియం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల చరిత్ర గల మైత్రీ క్రీడా మైదానాన్ని మినీ స్టేడియంగా మార్చి క్రీడాహబ్‌గా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మైత్రీ క్రికెట్ క్లబ్ 35వ అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక సవాళ్లను ఎదుర్కొని రూ.7.50కోట్లతో మినీ స్టేడియం నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రంలో ఒక మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, క్లబ్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గిరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, టోర్నమెంట్ నగదు స్పాన్సర్లు, పారిశ్రామికవేత్తలు కే.సత్యనారాయణరెడ్డి, సి.సత్యనారాయణరెడ్డి, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయకరెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌గుప్త, వైద్యుడు సుశ్రూత్‌కుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

● అవగాహన సదస్సులో అధికారులు



మాట్లాడుతున్న అధికారి

రామచంద్రాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని సైబర్ విభాగం అధికారులు సూర్యప్రకాష్, హరికిషన్, కేవీఎన్ ప్రసాద్, సంగారెడ్డి సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజపుష్ప ఆడిటోరియంలో కొత్తరకం సైబర్ నేరమైన డిజిటల్ అరెస్టుపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల్లో 90శాతం బాధితుల తప్పులే ఉంటాయన్నారు. ఇందులో ఎక్కువగా విద్యావంతులు ఉండటం విచారకరమన్నారు. 2024వ సంవత్సరంలో రాష్ట్రంలో రూ.1984 కోట్ల సైబర్ నేరాలు జరిగాయన్నారు. సగటున రాష్ట్రవ్యాప్తంగా రోజుకు రూ.5 కోట్లను దుండగులు దోచుకుంటున్నారన్నారు. ఇంటర్ నెట్ వ్యవస్థ ఎంత ఉపయోగమో, అంతే ప్రమాదమని హెచ్చరించారు. తెలియని గ్రూప్‌ల్లో కుటుంబ సభ్యుల ఫొటోలు పెట్టకూడదన్నారు. ఆశకు, ఆపై ఆత్రుతకు వెళ్తే నష్టపోక తప్పదన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కి సమాచారం అందిస్తే.. నగదును రీవకరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్‌ఐలు సురేష్, రమేష్, నిర్వాహకులు తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరిగారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి : సీపీఐఎం

నిజాంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఐఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నర్సమ్మ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార జాత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఐఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధు



సాయన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : బడుగుబలహీణ వర్గాల సమస్యలు, ఆకలి తీర్చేందుకు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న తెలంగాణ రాబిన్ హుడ్ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ కొనియాడారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మీర్‌పేట్‌లో పండగసాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నీలంమధు నేతృత్వంలో ముదిరాజ్ నాయకులు తరలివెళ్లారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పాపన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఏడుపాయల కమాన్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు యాదగిరి, హోంగార్డు మల్లేశం తదితరులున్నారు

● జహీరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ చౌరస్తా, పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం పట్టణ సీఐ శివలింగం నేతృత్వంలో ఆదివారం వాహనాల తనఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు ఎస్‌ఐ సంగమేశ్వర్‌లు మాట్లాడుతూ తనిఖీలకు వాహనదారులు, ప్రజలు సహకరించాలన్నారు.

మద్రి టూ ప్రజాభవన్ పాదయాత్ర



ప్రజాభవన్‌కు పాదయాత్రగా వెళ్తున్న మద్రి గ్రామ యువకులు

కోహీర్, జనవరి 19 : (ఆంధ్రజ్యోతి) కోహీర్ మండలంలోని మద్రి గ్రామ శివారులో టొరెంట్ గ్యాస్ పరిశ్రమ, పైపులైన్ ఏర్పాటు చేయొద్దని కోరుతూ మద్రి గ్రామానికి చెందిన యువకుల హైదరాబాదులోని ప్రజాభవన్‌కు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో పరిశ్రమ వద్దని నాలుగేళ్లగా మొరపెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా పోలీసులతో ఒత్తిడి తెస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో గ్యాస్ పరిశ్రమ, పైప్‌లైన్‌ను ఏర్పాటు కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.



దీక్ష చేపడుతున్న గ్రామస్థులు

తారు రోడ్డు పనులు పూర్తి చేయాలని దీక్షలు

నిజాంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అది మెదక్-కామారెడ్డి జిల్లా సరిహద్దు రహదారి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో నిజాంపేటవరకు రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు కోసం రూ.12 కోట్లు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించి రోడ్డు తవ్వి కేవలం కంకర పరిచి వదిలేశాడు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో విసిగిన ఆయా గ్రామాల ప్రజలు దీక్షకు పూనుకున్నారు. నిజాంపేట వరకు తారు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా వినకపోవడంతో గ్రామస్థులు ఎనిమిది రోజులుగా దీక్ష చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తూప్రాన్/శివ్వంపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే శివ్వంపేట మండలంలోని రత్నాపూర్ ఉన్నత పాఠశాలలో 1994-95, 1997-98 బ్యాచ్‌ల పదోతరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



రత్నాపూర్ పాఠశాలలో జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ కార్యాలయ స్థలం కబ్జాకు యత్నం

● అడ్డుకున్న ఉద్యోగులు



ప్రహరీని కూల్చి మట్టితో చదును చేసిన దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19: కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా మారింది జిల్లా కేంద్రంలో పరిస్థితి. ఎక్కడో ఎవరికి తెలియని స్థలమూ కాదు మరి.. ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనే కబ్జాకు పూనుకున్నాడో ఘనుడు. అదీ కూడా ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న స్థలంపైనే కన్నేశాడు మరి. పట్టణ పరిధిలోని 5వ వార్డుకు చెందిన ద్యాన్‌చంద్ చౌరస్తాకు ఆనుకొని మండల ప్రజా పరిషత్, ఎంఈవో, బాలసదనం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జల్లా పరిషత్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాల ప్రహరీని కూల్చి ఏకంగా మట్టిని వేసి చదును చేపట్టాడు. ఇది గమనించిన ఉద్యోగులంతా ఎవరు నీవు, ఎందుకు మట్టితో చదును చేస్తున్నావని ప్రశ్నించగా తాను ఇక్కడ దుకాణం ఏర్పాటు చేసుకోబోతున్నట్లు బుదలిచ్చాడు. ఇది ప్రభుత్వ స్థలమని నిలదీయగా అక్కడి నుంచి జారుకున్నాడని అధికారులు తెలిపారు.

సజావుగా ప్రభుత్వ పథకాల సర్వే



అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

నారాయణఖేడ్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యమైన భూముల గుర్తింపులో భాగంగా ఖేడ్ మున్సిపాలిటీపరిధిలో అధికారులు ఆదివారం సర్వే చేపట్టారు. స్థానిక తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్, ఆర్ఐ మాదవరెడ్డి, సర్వేయర్ మల్లేశం, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌రెడ్డి, ఏఈవో రాందాస్, రైతులతో కలిసి రెవెన్యూ పటం ఆధారంగా భూములను పరిశీలించారు.

● జహీరాబాద్ :పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మాసిబ్బంది, రేషన్‌డీలర్లతో తహసీల్దార్ రవీందర్ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 9వేల వరకు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● కొండాపూర్: మండల పరిధిలోని మల్కాపూర్‌లో జరుగుతున్న రైతు భరోసా సర్వేను ఆర్డీవో రవీందర్‌రెడ్డితో కలిసి జాయింట్ కలెక్టర్ మాధురి పరిశీలించారు. తహసీల్దార్ అనిత,ఆర్ఐ మహదేవ్, ఏవో గణేష్, సర్వేఆర్ సిద్ధులు తదితరులు ఉన్నారు.

● నాగల్‌గిద్ద : మండల పరిధిలోని ముక్తాపూర్, కారముంగి, ఏస్గీ గ్రామాల్లో చేపట్టిన సర్వేలో ఆర్ఐ.హన్మంత్‌రెడ్డి, ఏఈవో వినయ్‌చౌహాన్ పాల్గొన్నారు.

● అల్లాదుర్గం : మండలంలోని చిల్వర్ గ్రామంలో నిర్వహించిన సర్వేను జడ్పీ సీఈవో ఎల్లయ్య పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీవో లింగప్ప తదితరులు ఉన్నారు.

ధ్యాన సాధనతోనే మనసు మార్పు

● తటవర్తి వీరరాఘవరావు



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న వీరరాఘవరావు

కల్హేర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : ధ్యాన సాధనతోనే మనసు మార్పు చెందుతుందని, ఫలితంగా మానవుడికి ప్రయోజనం కలుగుతుందని భీమవరంకు చెందిన బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు అన్నారు. పిరమిడ్ స్పిర్చువల్ మూమెంట్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి రాధాస్వామి సత్సంగ్‌లో ఆదివారం ఉచిత ధ్యాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరరాఘవరావు శ్వాస మీద ధ్యాస అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాధాస్వామి సత్సంగ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీలు బాపురాజ్, మల్లేశం, సుశీల అంజయ్య, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌గుప్తా, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు అనసూయ అంజిరెడ్డి, సాయిరెడ్డి, ప్రజాప్రతినిధులు సంజీవరెడ్డి, దుర్గారెడ్డి, రవీందర్‌రెడ్డి, అంజయ్య, శ్రీకాంత్, హన్మండ్లు నిర్వాహకులు శంకర్, సంతోష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.